క్లుప్తంగా

నేడు, రేపు నీటి సరఫరాలో అంతరాయం

రామంతాపూర్: కృష్ణ ఫేజ్–2 రింగ్ మెయిన్‌కు సంబంధించిన బీరప్పగడ్డ వద్ద జంక్షన్ పనులు చేపడుతున్న దృష్ట్యా శనివారం, ఆదివారం రెండు రోజులపాటు ఉప్పల్ సర్కిల్ పరిధిలోని వెలుగుగుట్ట, బీరప్పగడ్డ రిజర్వాయర్ల పరిధిలోని రామంతాపూర్, ఉప్పల్, హబ్సిగూడ, చిలుకానగర్‌లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జలమండలి అధికారులు తెలిపారు.

ప్రతిభ ఏ ఒక్కరి సొత్తు కాదు



నమూనాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్

రామంతాపూర్: భరత్‌నగర్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులు సృజనాత్మకతతో రూపొందించిన పలు నమూనాలతో క్రియేటివ్ మేళాను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్రావు మాట్లాడుతూ.. ప్రతిభ, సృజనాత్మకత ఏ ఒక్కరి సొత్తు కాదని, ఇది ప్రతి విద్యార్థిలో దాగి ఉంటుందని, దాన్ని వెలికితీసేందుకు టీచర్స్, పేరెంట్స్ కృషి చేయాలన్నారు. స్కూల్ డైరెక్టర్ సూరం రాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నెలలో రెండుసార్లు విద్యార్థులతో వివిధ నూతన నమూనాలను తయారుచేసే శిక్షణ ఇచ్చే క్రాఫ్ట్ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. వైస్ ప్రిన్సిపల్ మమతారెడ్డి, నర్సిరెడ్డి, సోమశేఖర్‌గౌడ్, సుధాకర్, ఎల్బీరావు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు



అనితా పద్మారెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ నేతలు

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ మహిళా మోర్చా కన్వీనర్ అంపాల అనితా పద్మారెడ్డి జన్మదిన వేడుకలను నాచారం హెచ్ఎంటీ నగర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మల్కా ప్రకాష్, జిల్లా అధికార ప్రతినిధి పాతగాని గోపాల్‌గౌడ్, గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి రవినాయక్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నవీన్, గోపీ, నారాయణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు బోలెడు.. అమయ్ సార్‌పైనే ఆశలు

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నూతన కలెక్టర్‌గా అమయ్ కుమార్ బాధ్యతల స్వీకరణ
- రెండేళ్లకు పైగా కొనసాగిన ఇన్‌చార్జి పాలన తర్వాత కలెక్టర్‌గా నియామకం
- మసకబారిన పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టాలని కోరుతున్న జిల్లా ప్రజలు
- ప్రభుత్వ, అసైన్డ్, చెరువు శిఖం భూముల కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని వినతి





కలెక్టరేట్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్, కలెక్టరేట్‌లో కలియ తిరుగుతున్న అమయ్‌కుమార్

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డి.అమయ్ కుమార్ ముందు సమస్యలు సవాల్ విసురుతూ స్వాగతం పలుకుతున్నాయి. జిల్లాను ముందుకు నడిపించాల్సిన బృహత్తర బాధ్యత ప్రస్తుతం అమోయ్ కుమార్‌పై పడింది. ఇక్కడ దాదాపు రెండేళ్లకు పైగా ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ ఎస్.హరీష్ పక్కనున్న రంగారెడ్డి జిల్లాకు కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఇన్‌చార్జ్‌ల పాలనలో కొనసాగిన మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాకు కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అమోయ్‌కుమార్ దృష్టి సారించాల్సిన సమస్యలెన్నో ఉన్నాయి.

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆవిర్భావం నుంచి కలెక్టర్‌గా ఎక్కువ కాలం పని చేసింది డాక్టర్ ఎంవీ రెడ్డి ఒక్కరే. తర్వాత జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వాసం వెంకటేశ్వర్లు ఏడాది పూర్తి కాక ముందే బదిలీ అయ్యారు. అప్పటి నుంచి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ల పాలనలో కొనసాగుతూ వచ్చింది. ఏడు మాసాలు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన శ్వేతామహంతి జిల్లాకు ఏడు మాసాలు ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత దాదాపు రెండేళ్ల పాటు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతల్లో మెదక్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.హరీష్ పని చేశారు. దాదాపు మూడేళ్ల పాటు ఇన్‌చార్జుల పాలనలో కొనసాగిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పాలనా రంగంలో మసక బారిందని ఆరోపణలు లేకపోలేదు.

ప్రజా ఫిర్యాదుల విభాగమే ప్రామాణికం..

కలెక్టర్ నేతృత్వంలో ప్రతీ సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల విభాగమే(ప్రజావాణి) అధికారుల పని తీరుకు ప్రామాణికం. ఫిర్యాదుల విభాగం ప్రారంభం కాగానే అరగంట పాత(పెండింగ్) దరఖాస్తులపై సమీక్ష ఉండేది. పాత వాటిలో పరిష్కారమైనవి ఎన్ని? కాని వాటి కారణాలేంటనే దానిపై చర్చ జరిగేది. కొంత కాలంగా ఆ విధానం ఆగిపోయింది. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ కార్యాలయాల్లో న్యాయం జరగక ప్రజావాణికి వచ్చే బాధితులను కలెక్టర్ అందుబాటులో లేకపోతే పట్టించుకోవడం అనేది షరా మామూలుగా ఉండేది. అలాగే ప్రజల గోడు వినేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజావాణి'లో ఇన్‌చార్జి కలెక్టర్లు హాజరైంది చాలా తక్కువే. దీంతో ప్రజావాణి వినతులకు మోక్షం లభించకపోగా.. వాటి పరిష్కారం ఏ స్థితిలో ఉందన్న విషయం కూడా ఫిర్యాదుదారులకు తెలియక కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న సందర్భాలు అనేకం. ఈ నేపథ్యంలో కొత్త కలెక్టర్ ప్రజావాణిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలను జిల్లా ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరు శాతం, సమయం పాలన ఇష్టారీతిన ఉండేదన్న విమర్శలు లేక పోలేదు. ఇక్కడ ఎక్కువ కాలం కలెక్టర్‌గా పని చేసిన ఎంవీ రెడ్డి మాత్రమే పేదలు, రైతుల గోడు వినడం, క్షేత్రస్థాయిలో జరిగే అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా చూడటమే కాకుండా శాఖల వారీగా సమీక్షలు నిర్వహించడంతో ఆయన ప్రజల నుంచి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ భూముల వివరాలు...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 11 మండలాల పరిధిలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉండగా, 11,384 ఎకరాలు అసైన్డ్ భూములు ఉన్నాయి. ఈ అసైన్డ్ భూములను 2004 నాటికి 116 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 8,230 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీలకు చెందిన నిరుపేద లబ్ధిదారులకు ప్రభుత్వం అసైన్డ్ చేసింది. అసైన్డ్ భూముల్లో దాదాపు 40 శాతం అన్యాక్రాంతం కాగా, ఇందులో వివిధ రకాల కట్టడాలు వెలిశాయి. అలాగే జిల్లాలో రూ.26 వేల కోట్ల విలువ చేసే 7,458 ఎకరాల భూములపై వివిధ కోర్టుల్లో 706 కేసులు నడుస్తున్నాయి.

సవాల్‌గా భూ ఆక్రమణలు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కీసర, మేడిపల్లి, అల్వాల్, కాప్రా, దుండిగల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, మేడ్చల్, కూకట్‌పల్లి, శామీర్‌పేట, ఎంసీపల్లి, బాలానగర్, ఘట్‌కేసర్ మండలాలు ఉన్నాయి. వీటిలో భూకబ్జాలు, ఆక్రమణలు జోరుగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా జిల్లాలో 13 పురపాలక సంఘాల పరిధిలో 1368 అక్రమ నిర్మాణాలు, 4 లేఅవుట్లు ఉండగా, 61 పంచాయతీల్లో 2100 అక్రమ నిర్మాణాలు, 34 లేఅవుట్లు ఉన్నాయి. టౌన్‌ప్లానింగ్ విభాగం అవినీతికి అడ్డాగా మారింది. ఇంటి నంబర్లు మొదలుకొని ఇంటి అనుమతులకు అమ్యామ్యాలు ముట్టజెప్పాల్సిన పరిస్థితి ఉంది. సంబంధిత జిల్లా అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో ఇష్టారాజ్యంగా సాగుతోంది. భూ కబ్జాల్లో పలువురి రాజకీయ నేతలు, బడా బాబుల పాత్ర ఉండటంతో వాటిని పరిరక్షించే బాధ్యతను రెవెన్యూ శాఖ చూసీ చూడనట్లు వ్యవహరించినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణ బాధ్యత కొత్త కలెక్టర్‌కు సవాల్‌గా మారనుందని తెలుస్తోంది.

ధరణి చిక్కులు విప్పుతారా?

జిల్లాలో ధరణి సంబంధించి 45 దరఖాస్తులు రాగా, ఇందులో 43 వేలు పరిష్కారమైనట్లు చెబుతున్నప్పటికీ ప్రతీ రోజు ధరణికి సంబంధించిన భూ సమస్యలపై పదుల సంఖ్యలో రైతులు, ఇతరులు కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అభివృద్ధి పనులు సైతం అంతంతే...

జిల్లాకు 2,420 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 630 మాత్రమే పూర్తయ్యాయి. 13 పట్టణాల్లో 16.82 ఎకరాల్లో రూ.39.90 కోట్లతో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ల నిర్మాణం నత్తకు నడక నేర్పుతున్నాయి. 'మన ఊరు–మన బడి' కింద నిర్మిస్తున్న ప్రభుత్వ బడుల పరిస్థితి దీనికి తీసిపోని విధంగా ఉంది. 176 బడుల్లో ఇప్పటి వరకు 25 మాత్రమే పూర్తయ్యాయి. మిగతా అభివృద్ధి పనులు కూడా నెమ్మదించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అర్హులకు చేర్చే విషయాలపై దృష్టి సారించాల్సి ఉంది.

టీచర్ల బదిలీలు..

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ మొదలైంది. దీనికి ముందే కొంత మంది దొడ్డిదారిన వచ్చి పోస్టులు పొందారు. త్వరలోనే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. క్లిష్టమైన ఈ ప్రక్రియను కొత్త కలెక్టర్ ఎంత సమర్థవంతంగా నిర్వహించనున్నారో చూడాల్సి ఉంది. ప్రభుత్వం వీఆర్ఎలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. పేస్కేల్, సర్వీస్ రూల్స్ వంటి అంశాలపై ఇప్పటికీ ఓ స్పష్టత లేకపోవడం వంటి అంశాలు కొత్త కలెక్టర్‌కు సవాల్‌గా మారే అవకాశం ఉంది.

అన్ని కాలనీల్లో మౌలిక వసతులు



సుభాష్‌నగర్ చౌరస్తాలో హైమాస్ట్ లైట్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

అల్వాల్: వెంకటాపురం డివిజన్ సుభాష్‌నగర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్స్‌ను మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, స్థానిక కార్పొరేటర్ సబితకిషోర్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వెంకటాపురం డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు టీవీ భాస్కర్, ప్రభాకర్, మోసిస్, పెంటన్న, ప్రభాకర్, ఎలక్ట్రికల్ ఏఈ స్వాతి, ప్రసాద్, రమేష్, ఉదయ, స్వప్న పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో కంటి వెలుగు ప్రారంభం



కళ్ల అద్దాలను అందజేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 2వ డివిజన్ ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని మేయర్ సామల బుచ్చిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో వారం రోజుల పాటు 100 రోజులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వారు కళ్ల అద్దాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్, కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కొత్త రవిగౌడ్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్‌సీ వంతెనను విస్తరించాలి



కమిషనర్ లోకేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ ఎస్ఎఫ్‌సీ(బ్రిడ్జి) వంతెనను త్వరితగతిన విస్తరించాలని కోరుతూ శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్‌కు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. 45 సంవత్సరాల క్రితం ఎస్ఎఫ్‌సీ రైల్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించింది. ఎస్ఎఫ్‌సీ నుంచి వేలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో బ్రిడ్జి వద్ద భారీగా ట్రాఫిక్ జామ్‌తో పాటు ప్రమాదాలు నెలకొంటున్నాయని కమిషనర్‌తో కార్పొరేటర్ పేర్కొన్నారు. రైల్ ఓవర్ బ్రిడ్జి అభివృద్ధి పనుల కోసం ఎస్ఆర్‌డీపీ కింద నిధులు మంజూరయ్యాయని త్వరితగతిన పనులను పూర్తి చేసి ట్రాఫిక్ నుంచి విముక్తి కల్పించాలని కోరారు.

అర్హులకు ఇళ్లు, స్థలాలు కేటాయించాలని ధర్నా



మల్కాజిగిరి: అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటి స్థలం కేటాయించాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక మల్కాజిగిరి మండల కమిటీ డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం కార్యదర్శి కృపాసాగర్ మాట్లాడుతూ గతంలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి ఇళ్లు కేటాయించాలన్నారు. ఇంటి స్థలం ఉన్న వారికి ప్రభుత్వం ఇవ్వాలనుకుంటున్న రూ.3 లక్షలు సరిపోవని, రూ.6 లక్షలు కేటాయించాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది సంవత్సరాలైనా ఇళ్లు, స్థలాలు కేటాయించలేదన్నారు. ధర్నా అనంతరం డీసీకి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ కార్యదర్శి నర్సింగ్‌రావు, ఐద్వా మండల కార్యదర్శి మంగ, ప్రజాసంఘాల నాయకులు యాదగిరి, షాహీన్, సరోజ, అనసూయ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

మల్కాజిగిరి: ఆదర్శనగర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 5వ తేదీ షిరిడీసాయిబాబా, మహాగణపతి, రామలింగేశ్వర, లలితాపరమేశ్వరి, వల్లీ దేవసేనా సహిత సుబ్రహ్మణ్యస్వామి, దత్తాత్రేయ, నవగ్రహదేవతా విగ్రహాలు ప్రతిష్టాపన జరుగుతుందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంటయ్య, శ్రీనివాసరెడ్డి తెలిపారు.



సంస్కృతి సంప్రదాయాలను అలవర్చుకోవాలి



ఫెస్ట్ ఇండియా వేడుకల్లో కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి

బోడుప్పల్: చిన్నతనం నుంచి విద్యార్థులు సంస్కృతి సంప్రదాలను పాటించాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన ఫెస్ట్ ఇండియా వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వేషధారణలో ఆకట్టుకున్నారు. వివిధ రకాల వంటకాలు, పరిశ్రమలు వంటి నమూనాలను ప్రదర్శించారు. ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ మాధవి సంఘీ, నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మల్లాపూర్: నాచారం వెస్లీ కో ఎడ్యుకేషన్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం చంద్ర గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. 1995–96 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించుకున్నారు. కార్యక్రమంలో నరేందర్, చంద్రశేఖర్, సత్యం, భరత్‌గౌడ్, వెంకటేష్, స్వామి, బండారి విశ్వంగౌడ్, మురళి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ పటిష్టతకు కృషి చేయాలి



శ్రీకాంత్‌కు నియామక పత్రం అందజేస్తున్న హరీష్‌రెడ్డి

అల్వాల్: పార్టీ పటిష్టతకు కృషి చేయాలని బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి అన్నారు. మచ్చబొల్లారం ప్రాంతానికి చెందిన పీవీ శ్రీకాంత్‌ను జిల్లా అర్బన్ కార్యనిర్వాహక సభ్యులుగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ ఆదేశాల ప్రకారం నడుచుకుంటూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వీకే.మహేష్, దండుగుల వెంకటేష్, వాసంశెట్టి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లను కేటాయించండి



ఉప్పల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని ఉప్పల్ సర్కిల్ ప్రజాసంఘాల పోరాట వేదిక కోరింది. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నామని, పెరిగిన అద్దెలతో అవస్థలు పడుతున్నామన్నారు. మేడ్చల్ జిల్లాలో నిర్మించిన ఇళ్లను వెంటనే పేదలకు కేటాయించాలని కోరారు. అనంతరం ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.వినోద, సీఐటీయూ ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జే.వెంకన్న, సీఐటీయూ నాయకులు జి.బీష్మచారి, వెంకటేష్, జోసెఫ్ తదితరులు ఉన్నారు.

సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



సీతారామచంద్రస్వామి విగ్రహ పతిష్ఠ మహోత్సవంలో కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: మచ్చబొల్లారంలోని శాన్విప్రైడ్ హోమ్స్ విల్లాలోని సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఎం.కృష్ణారెడ్డి, గుండారం మహేష్‌కుమార్, నరేష్‌కుమార్, సాయిదీప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్: రైస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యునైటెడ్ వే ఆఫ్ సంస్థ సౌజన్యంతో రామ్‌రెడ్డినగర్ కమ్యూనిటీ హాల్‌లో మూడు మాసాలుగా కొనసాగుతున్న ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్రావు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు సాధికారత సాధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు మహిళా అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. సంస్థ ఫౌండర్ మొగుళ్ల అమరేందర్, నరేష్, మధుబాబు, వెంకన్న పటేల్, రావూరి బాలరాజు, సోమశేఖర్‌గౌడ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.